క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తాళ్లూరు, విఠలాపురం, రాజానగరం గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పి శ్రీనివాసరావు తెలిపారు.ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓపెన్ హౌస్‌పై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

ముండ్లమూరు (కురిచేడు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీసుస్టేషనులో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, మహిళా ఉద్యోగినులను పోలీసు స్టేషన్‌కు ఆహ్వానించి అవగాహన కల్పించారు. ఫిర్యాదుదారులు, బాధితులకు పోలీసుల ప్రత్యేక ఏర్పాట్ల గురించి చర్చించారు. అందుబాటులో ఉన్న మహిళా చట్టాల గురించి ఎస్సై నాగరాజు మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు

ముండ్లమూరు (కురిచేడు): మహిళ ఆత్మహత్యపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ అంకారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన నాగులూరి తిరుపతమ్మ (22) తలనొప్పి భరించలేక ఫిబ్రవరి 24వ తేదీ కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు పేస్టు కలుపుకొని తాగింది. ఆమెను చికిత్స కోసం ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మాదిగ అమర వీరుల దినోత్సవం



ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దదోర్నాల: మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ జాతి కోసం ప్రాణాలు అర్పించిన వారి ఆశయాలు సాధించాలన్నారు. సన్నిధి కిశోర్‌కుమార్, నేరెళ్ల జాను, తత్తూరి రత్నప్రసాద్, కోడి నతానియేలు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సింగా భూషి, కటికల దానం, పూర్ణకంటి వెంకటయ్య, జడ్డా హనోక్, కటికల జీనా పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మరియదాసు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని నూజిల్లపల్లికి చెందిన మరియదాసు తన భార్య కాపురానికి రాలేదని శనివారం రాత్రి భార్యకు వీడియో కాల్ చేసి చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. మరియదాసు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన యువతితో మరియదాసుకు వివాహమైంది. కొంతకాలం కాపురం సజావుగా సాగిన తర్వాత మరియదాసు భార్యకు పాము కాటేసింది. దాని చికిత్స కోసం పుట్టింటికి వెళ్లిన ఆమె తిరిగి తన వద్దకు రావడం లేదని, ఎన్నిసార్లు రమ్మన్నా రాకుండా అక్కడే ఉంటోందని మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108కి సమాచారం అందించడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మరియదాసును అద్దంకిలోని వైద్యశాలకు తరలించారు.

మినీలారీ బోల్తా



ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని పోలవరం వద్ద మినీలారీ బోల్తా పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. అద్దంకి నుంచి కొబ్బరిబోండాల లోడుతో దర్శి వెళ్తున్న మినీ లారీ పోలవరం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వాహనం దెబ్బతింది.

ముచ్చటైన అక్షరాలతో మెరుగైన ఫలితాలు

- అందమైన చేతిరాతతో వంద మార్కులకు అవకాశం
- పది, ఇంటర్ విద్యార్థులు దస్తూరిపై దృష్టి సారించాల్సిందే



పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం బయ్యన్న



ఓ విద్యార్థి దస్తూరి

పుల్లలచెరువు: అందమైన చేతిరాత వ్యక్తిత్వానికి మారు రూపమనేది నిపుణుల మాట. దస్తూరి ఆధారంగా మనిషి గునగణాలు అందచనా వేయవచ్చు. విద్యార్థుల చేతిరాత అందంగా ఉంటే పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు తోడ్పడుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. చేతి రాతను మెరుగు పర్చుకుంటే పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధ్యమవుతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పలు జాగ్రత్తలు పాటిస్తూ చేసే సాధనతో చేతిరాతను మెరుగుపర్చుకోవచ్చు. వై.పాలెం నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఈ అంశంపై దృష్టి నిలిపి పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థుల చేతిరాత మెరుగుపడేలా తగిన మెళకువలు నేర్పుతున్నారు. ప్రత్యేకంగా దస్తూరీ పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

సాధన ఇలా చేయాలి

సున్నా, నిలువు గీతలపై సాధన చెయ్యాలి. తెలుగు అక్షరాలు గుండ్రంగా ఉంటే చూసే వారిని ఆకట్టుకుంటుంది. వర్కుబుక్స్, డబుల్ లైన్, పుస్తకాలపై చేసే సాధన దస్తూరిని మెరుగుపరుస్తుంది. ఆంగ్ల అక్షరాలు మూడు మిల్లీమీటర్లు, తెలుగు, హిందీ లక్షరాలు నాలుగు మిల్లీమీటర్ల పొడవు ఉండేలా రాస్తే అక్షరాలు ముత్యాల్లా కనిపిస్తాయి. అక్షరాలు, పద్యాలు, వాక్యాల మధ్య తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలి. మరీ ఎక్కువ ఖాళీలు వదిలినా చూసేందుకు బాగుండదు. అక్షరాల్లో, వాక్య నిర్మాణంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి. కొందరు మొదటి వాక్యం బాగా రాసినా తర్వాత రాసే కొద్దీ అక్షరాల స్వరూపం మారి ఎగుడు, దిగుడుగా వస్తుంటాయి. అలా కాకుండా సాధనతో మార్చుకోవాలి. నిరంతరం చదివింది మననం చేసుకుంటూ చిత్తు కాగితాలపై రాస్తూ ఉంటే ఆయా అంశాలపై మెదడుకు పట్టడంతో పాటు వేగంగా రాసే విధానం సైతం అలవడుతుంది. దీని ద్వారా పరీక్షల్లో సమయం కలిసి వచ్చి మరిన్ని సమాధానాలు రాసేందుకు తద్వారా అధికంగా మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

అక్షరమే ఆయుధం



మార్కుల సాధనకు అందమైన చేతిరాత ఎంతో కీలకం. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు దస్తూరీ మెరుగు పరుచుకోవడంపై సైతం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వేగంగా, అందంగా రాయడం అనేది పరీక్షల విజయానికి సోపానం.

– ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు, జెడ్పీ స్కూల్, పుల్లలచెరువు



సూర్యకిరణాభిషేకంలో కాళహస్తీశ్వరుడు



సూర్యకిరణాభిషేకంలో జ్ఞానప్రసూనాంబదేవి

కమనీయం..రమణీయం

- ఆది దంపతులను స్పృజించిన భానుడు

కురిచేడు: ఎంతో కమనీయమైన.. రమణీయమైన దృశ్యం స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఆది దంపతులను ఉదయ భాస్కరుడు స్పృజించటం కనువిందు చేసింది. ఉదయం ఆలయ పూజారి ఆలయం తలుపులు తెరచే సరికి సూర్య కిరణాల వెలుగులో శ్రీ కాళహస్తీశ్వరుడు, శ్రీ జ్ఞానప్రసూనాంబదేవిలు మెరిసిపోతున్నారు. సుమారు 30 అడుగుల దూరంలో ఉన్న గర్భగుడిలోకి సూర్యకిరణాలు చొచ్చుకు వచ్చి ఆది దంపతులను అభిషేకించాయి. ఆ సన్నివేశాన్ని చూసిన భక్తులు పులకించిపోయారు. ఏటా సూర్యనారాయణుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయనానికి, ఉత్తరాయణం నుంచి దక్షిణాయనానికి ప్రయాణం చేస్తున్న సమయంలో మధ్యలో ఒకటి రెండు రోజులు మాత్రమే సూర్యకిరణాలు గర్భగుడిలోని మూలవిరాట్‌లను తాకుతాయి.

తిరుమలనాథ స్వామికి పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



పుల్లలచెరువు: వినతిప్రతం అందజేస్తున్న సీపీఐ కార్యదర్శి గురునాథం



వైపాలెం: వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



త్రిపురాంతకంలో ఆందోళన చేస్తున్న రైతు సంఘ నాయకులు

పుల్లలచెరువు: రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని సీపీఐ మండల కార్యదర్శి గురునాథం మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేవలం ప్రజలను, రైతులను మోసం చేయడం తప్ప ఏమీ లేదని అర్థమవుతోందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా మాయ మాటలు చెప్పడం పద్ధతి కాదన్నారు. తప్పని సరిగా రూ.2 వేల కోట్ల కేటాయించాలని డిమాండ్ చేశారు.

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే ప్రభుత్వం జిల్లా ప్రజలను మోసం చేస్తున్నట్లుందని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాజెక్టుకు కేవలం రూ.359 కోట్లు కేటాయించినందుకు నిరసనగా శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్ వేగవంతంగా పూర్తి కావాలంటే తక్షణమే రూ.2 వేల కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేయించాలని డిమాండ్ చేశారు. కేటాయించిన నిధుల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.116 కోట్లు కేటాయించారని, ఈ విధంగా వెలుగొండకు కేటాయింపులు చేసుకుంటూ పోతే మరో 15 ఏళ్లలో కూడా ప్రాజెక్ట్ పూర్తి కాదన్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయకుంటే తీవ్ర ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం డీటీ మల్లికార్జున నాయుడికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు కేవీ కృష్ణగౌడ్, నక్కా తిరుపతయ్య, షేక్ పీరా సాహెబ్, ఎస్.పిచ్చిరెడ్డి, ఎస్.కృష్ణారావు, షేక్ అన్వర్‌బాషా, షేక్ జాన్‌బాషా పాల్గొన్నారు.

త్రిపురాంతకం: వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.359 కోట్లు కేటాయించినందుకు నిరసనగా శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్ట్ నిర్వాసితులకే రూ.వెయ్యి కోట్లు ఇవ్వాల్సి ఉండగా బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తే ప్రాజెక్ట్ పనులు ఏ విధంగా పూర్తవుతాయని ఆయన ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం చిత్తశుద్ధితో వెలుగొండకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు డి.శ్రీనివాస్, బాణాల రామయ్య, రైతులు కోటయ్య, అల్లాభక్షు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి



ఓపెన్ హౌస్ గురించి వివరిస్తున్న ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేసన్‌లో అన్ని రికార్డులు విద్యార్థులకు చూపించి వాటిపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చట్టాల గురించి తెలుసుకోవాలని, వాటిపై అవగాహన కల్పించుంటే భవిష్యత్‌లో ఏలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండి సమాజ అభివృద్ధిలో మహిళలు ప్రధానపాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా వారిని ప్రోత్సహించాలని కోరారు.

రెండు బైకులు ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన దారా గోపి

కురిచేడు: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పొట్లపాడు రైల్వే అండర్ పాస్ వద్ద శనివారం జరిగింది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. దొనకొండ మండలం భూమనపల్లికి చెందిన దారా గోపి తన కుటుంబ సభ్యులతో మిరపకాయల కోతకు పొట్లపాడు గ్రామానికి వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి బైకుపై వెళ్తుండగా పొట్లపాడు రైల్వే అండర్ పాస్ వద్ద మూలమలుపులో ఎదరుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. గోపి తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది వెంకటప్పయ్య, యోహానులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ విభాగాల అధ్యక్షులు వీరే

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం యర్రగొండపాలెం నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులను శనివారం నియమించింది. యువజన విభాగం అధ్యక్షుడిగా ఆల్ల కృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పల్లె సరళకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఒంటేరు నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రమావత్ బద్దు నాయక్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సన్నెపోగు సుందరరావు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా యలగల బాదరయ్య, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా ముద్ద శ్రీనివాసులు, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కందూరి కాశీవిశ్వనాథ్, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా షేక్ షెక్షావలి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా వనపర్తి మాలతి, లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడిగా మాలపాటి సుబ్బారెడ్డి, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా గుమ్మా గురవయ్య, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా మలపోలు శ్యాం, ఐటీ విభాగం అధ్యక్షుడిగా దుద్దేల రామకృష్ణారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా గుర్రం ముత్యాలయ్య, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా నారు సుబ్బారెడ్డి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా ఒంగోలు సుబ్బారెడ్డిలను నియమించారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న అంజలి

దొనకొండ: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, క్రమశిక్షణతో చదువుకుని మంచి మార్కులు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి అంజలి కోరారు. శనివారం స్థానిక బీసీ బాలురు, బాలికల వసతి గృహాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీసీ బాలికల వసతి గృహానికి 8 బాత్రూమ్‌లు మంజూరయ్యాయని, వెంటనే నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని ఆమె సంక్షేమాధికారి ప్రభావతికి సూచించారు. అనంతరం సంక్షేమ అధికారులకు సూచన, సలహాలు అందించారు. ఆమె వెంట బీసీ సంక్షేమ సహాయ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి చెక్కు అందచేత



చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పొదిలి: మండంలోని సల్లూరులో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న జగన్నాథం రామకృష్ణ ఇటీవల మృతి చెందాడు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం రాత్రి రామకృష్ణ సంతాప సభ జరిగింది. యూనియన్ కోసం రామకృష్ణ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.2 లక్షల చెక్కును రామకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. అధ్యక్షుడు సానికొమ్ము సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌హై, పెమ్మని బాలవెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముందు చూపుతో ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు కుటుంబ సంక్షేమ నిధికి రూపకల్పన చేసిన యూటీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామిరెడ్డి సేవలు కొనియాడారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి.బుజ్జిబాబు, జేవీవీ డివిజన్ కార్యదర్శి దేవ ప్రసాద్, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ సరళిని పరిశీలించిన డిప్యూటీ సీఈఓ



పింఛన్ నగదు అందజేస్తున్న బాలమ్మ

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో పంపిణీ చేస్తున్న పింఛన్ సరళిని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ బాలమ్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లోని లబ్ధిదారులతో మాట్లాడారు. పింఛన్లు వెంటనే పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా లబ్ధిదారులతో మాట్లాడాలని ఆమె సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ బి.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి తిరుమల నారాయణ, వీఆర్‌ఓ శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్ భవనానికి స్థలం వితరణ



కృష్ణను సన్మానిస్తున్న టైలర్స్ సంఘు నాయకులు

త్రిపురాంతకం: మండల టైలర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి మేడపి ఎంపీటీసీ సభ్యుడు పాటిబండ్ల కృష్ణ తన సొంత స్థలాన్ని శనివారం కేటాయించారు. గతంలో టైలర్‌గా కొనసాగినందుకు కృతజ్ఞతగా తమ అసోసియేషన్ భవన నిర్మాణానికి సహకరించిన ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టైలర్స్ కోటి, వెంకటేశ్వర్లు, సత్తార్, శ్రీను పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

తాళ్లూరు: పశుపోషకులు తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యశాల డాక్టర్లు ప్రతాప్‌రెడ్డి, రాంబాబు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద శనివారం పలు పశువులకు టీకాలు వేశారు. తాళ్లూరు, తూర్పు గంగవరం గ్రామాల్లో నాలుగు నెలలు దాటిన 100 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, 4 నుంచి 8 నెలలు వయసు కలిగిన 23 పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు డాక్టర్లు తెలిపారు.

విద్యాభివృద్ధికి నారాయణరెడ్డి సేవలు మరువలేనివి



నారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎస్‌వీ నారాయణరెడ్డి సేవలు మరువలేనివని ఎంఈఓ మస్తాన్‌నాయక్ కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఎస్‌వీ నారాయణరెడ్డిని ఉపాధ్యాయులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో దాదాపు 35 ఏళ్లు విధులు నిర్వహించిన నారాయణరెడ్డి మండల పరిధిలోనే 32 ఏళ్లు బాధ్యతలు నిర్వహించారన్నారు. సహచర ఉపాధ్యాయుల పరస్పర అవగాహనతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్‌తో పాటు ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ అనుసూయాదేవి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, విజయమాణిక్యం, నాగమూర్తి, కిరణ్‌కుమార్, పోలయ్య, రామానాయక్, ఆవులయ్య, వెంకటశివ, అనిత, చంద్రమౌళి, సుబ్బారెడ్డి, మధు, మారుతీరెడ్డి, లక్ష్మీనారాయణలు పాల్గొని నారాయణరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.